



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 25 జులై 2025 పేజీలు 8




# బడా భూస్వాములే నీటి దొంగలు..?

- అర్ధరాత్రి నీటి కాలువలపై ఉన్న డ్యామ్‌లను పగలగొడుతున్న వైనం
- నీటి కోసం బడా భూస్వాములు, చిన్న సన్నకారు రైతులు మధ్య పోరాటం
- చోద్యం చూస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు
- డ్యాములను పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు రైతులు విజ్ఞప్తి
- నీరు సమృద్ధిగా విడుదల చేస్తే రైతుల మధ్య గొడవలు ఉండవంటున్న మండల ప్రజలు

2లో




వ్యవసాయ అనుబంధ రంగాలలో....

## వార్షిక వృద్ధిరేటు సాధించడంలో ఏపీ ప్రథమం

### గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ 2024-25వ సంవత్సరంలో వ్యవసాయ అను బంధ రంగాలలో 8.8 శాతం వార్షిక వృద్ధి రేటు సాదించడంలో ప్రథమ స్థానంలో వుందని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గం, ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్టు ప్రజా మందిరంలో గురు వారం గుంటూరు జిల్లా, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ మిగతా 2లో...

## లక్ష్యాల సాధనకు బంగారు బాటలు వేసుకోండి



- ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

7

# వ్యవసాయ అనుబంధ రంగాలలో వార్షిక వృద్ధి రేటు సాధించడంలో ఏపీ ప్రధమం

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షత వహించి డిగ్రీలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమానికి పంజాబ్ రాష్ట్ర ఎన్ఆర్ఐ కమిషన్ సభ్యుడు, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏ వేణు ప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి స్నాతకోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి అనుమతితో ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీ దేవి స్నాతకోత్సవ ప్రొసీడింగ్స్ ను ప్రారంభించారు. ఈ క్రమంలో ఆమె విశ్వవిద్యాలయం ఏర్పాటు, పుట్టుపూర్వోత్తరాలు, అందిస్తున్న కోర్సులు, సాధించిన విజయాలు వివరించారు. స్నాతకోత్సవంలో 46 మందికి డాక్టరేట్ లు, 196 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 1,420 మంది గ్రాడ్యుయేట్లకు వివిధ పతకాలు మెరిట్ సర్టిఫికెట్లు అందించి అభినందించారు. అదేవిధంగా వ్యవసాయ శాస్త్రంలో అత్యుత్తమ పరిశోధనలకు గాను డాక్టర్ ఎం.వి. రెడ్డి జాతీయ అవార్డు%-%2024ను డాక్టర్ ప్రశాంత కె. దాష్, ఎ.డి.జి.-కమర్షియల్ క్రాప్స్, ఐ సి ఏ ఆర్, న్యూఢిల్లీ, వి. రామచంద్రరావు జాతీయ పురస్కారం-2024 ను డాక్టర్ పి.వి.సత్యనారాయణ, పరిశోధన సంచాలకులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారికి ప్రధానం చేసారు. ఇదే క్రమంలో పలువురు ప్రొఫెసర్లు, సైంటిస్టులకు మెరిటోరియస్ టీచర్ అవార్డ్స్, మెరిటోరియస్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డ్స్, మెరిటోరియస్ ఎక్స్టెన్షన్ సైంటిస్ట్ అవార్డ్స్, యంగ్ సైంటిస్ట్ అవార్డ్స్ అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నరు మాట్లాడుతూ 2050 నాటికి దేశ జనాభా 1.6 బిలియన్లు పెరిగే అవకాశం ఉంటుండగా దీని ప్రభావం వలన ఆహార ఉత్పత్తి డిమాండ్ 400 మిలియన్ టన్నులకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ డిమాండ్‌ను తీర్చడానికి ఇంకా ఎక్కువ మొత్తంలో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం వుందన్నారు. 2024లో వ్యవసాయ రంగం దేశ జిడిపికి సుమారు 16 శాతం వరకు దోహదపడిందని, ఈ రంగం దేశ జనాభాలో దాదాపు 46.1 శాతం మందికి జీవనోపాధిని కూడా కల్పిస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక సర్వే 2025 ప్రకారము, ఈ రంగం 2025వ సంవత్సరంలో దాదాపు 3.8 శాతం వృద్ధి రేటును సాదించిందని, అయితే, కనీస అవసరాలైన ఆహారం, దాణా పశుగ్రాసం డిమాండ్‌ను తీర్చడానికి మాత్రమే కాకుండా, పేదరిక నిర్మోలనకు, దేశం మొత్తం ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడానికి, దేశ జిడిపిలో 8-9 శాతం వృద్ధిని కొనసాగించడానికి సంవత్సరానికి 4 శాతం వ్యవసాయ వృద్ధి రేటు అవసరం అన్నారు. ఆంధ్రప్రదేశ్ 2024-25వ సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో 8.8 శాతం వార్షిక వృద్ధి రేటు సాదించడంలో ప్రధమ స్థానంలో వుందని తెలిపారు. ఈ సందర్భంగా, రాష్ట్ర వార్షిక వ్యవసాయ వృద్ధి రేటులో ఇంత గొప్ప పురోగతికి కారణమైన వారందరికి అభినందనలు తెలియజేశారు. ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నప్పుడు, పోషకాహార భద్రతను కూడా జాగ్రత్తగా చూసుకోవడం అవసరం ఉందని, దీనికనుగుణంగా, భారతదేశం తృణధాన్యాలు, చిరు ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించిందని చెప్పవచ్చన్నారు. అంతేకాకుండా, పోషకాహారలోప సమస్యలను నివారించడానికి పప్పుధాన్యాల ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని రైతాంగానికి 60 సంవత్సరాల నిబద్ధతతో కూడిన సేవలను అందిస్తోందని, అసాధారణ వ్యవసాయ ప్రతిభను పెంపొందించడంలో సుదీర్ఘమైన, విశిష్టమైన



చరిత్రను కలిగి ఉందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు జాతీయంగా అత్యధిక సంఖ్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లను పొందడం, ఐ.సి.ఎ.ఆర్ వారి ఎ.ఐ.ఇ.ఇ.ఎ. పరీక్షలలో విజయం సాధించడం ద్వారా విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఎంతో గర్వంగా ఉందన్నారు.

విశ్వవిద్యాలయ నిరంతర కృషి ఫలితంగా 2023-24లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో 25 మెరుగైన పంట రకాలను విడుదల చేయడం జరిగిందని, దీని ద్వార విశ్వవిద్యాలయం రైతులకు ఆదాయం పెంపొందించే దిశలో ముఖ్యంగా వరిలో నాణ్యమైన దిగుబడులను సాదించినదని అనటంలో సందేహం లేదన్నారు. విశ్వవిద్యాలయం వివిధ పంటలలో 10,215 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాలు, 17,240 క్వింటాళ్ల ఫౌండేషన్ ధృవీకరణ విత్తనాలను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని బహుళ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, రైతులకు విత్తనాన్ని పంపిణీ చేయడంలో ఎంతగానో కృషి చేసిందని అభినందించారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, క్షేత్ర పరిశీలనలు, రోగనిర్ధారణ సర్వేల ద్వారా అధిక ఉత్పాదకతను, ఆహార భద్రతను సాధించడానికి వ్యవసాయంలో సాంకేతిక సాధికారత అత్యంత ప్రాముఖ్యతను విస్తరణ కార్యకలాపాల ద్వార చాటి చెబుతున్నాయని, విజ్ఞానాన్ని ఆచరణలోనికి తీసుకురావడంలో విశ్వవిద్యాలయం ముందంజలో ఉందని పేర్కొన్నారు. భారత హరిత విప్లవ పితామహుడు, భారతరత్న డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ చెప్పినట్లుగా, వ్యవసాయం తప్పు దారి పడితే, మరేదీ సరైన దారిలో వెళ్ళే అవకాశం ఉండదని పేర్కొంటూ, దీనికి అనుగుణంగా రసాయనాదారిత వ్యవసాయ దుష్ప్రభావాలను గ్రహించి, నేటి వ్యవసాయం అధిక దిగుబడి, ఒత్తిళ్లను తట్టుకునే జన్యుపరంగా రూపొందించిన పంటలు, భిన్న వాతావరణాన్ని తట్టుకునే సాంకేతికతలు, పర్యావరణనుకూల సాంకేతికతల వైపు కదులుతోందని అన్నారు. భారతదేశ వ్యవసాయ నిజమైన బలం చిన్న రైతులలోనే ఉందన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాటలను నొక్కి చెబుతూ, ఉత్పత్తి ధరల ముందస్తు అంచనాలకు సంబంధించిన మార్కెట్ ఇంటెలిజెన్స్‌పై ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తద్వారా రైతులు మార్కెట్ డిమాండ్ ను బట్టి సరైన పంటలను ఎంపిక చేసుకొని సాగుచేసి మెరుగైన ధరలను పొందగలమన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు, మీ విద్య కేవలం ప్రారంభం మాత్రమే అని గుర్తుంచుకోవాలని, సవాళ్లను స్వీకరించడం, సరిహద్దులను దాటడం, నేర్చుకోవడం ఎప్పుడూ ఆపవద్దని ప్రోత్సహించారు. స్నాతకోత్సవంలో సర్టిఫికెట్లు అందుకున్న డాక్టరేట్ లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్లు, అదేవిధంగా వివిధ పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు పొందిన వారందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ముఖ్య అతిథి పంజాబ్ రాష్ట్ర ఎన్ఆర్ఐ కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏ వేణు ప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీలు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థిగా తను అభ్యసించిన విద్య ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి, అత్యున్నత సామాజిక సేవకు ఎంతగానో దోహద పడిందన్నారు. ఇంతటి ఉన్నతమైన విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించడం, ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించడం విద్యార్థుల అదృష్టంగా ఆయన అభివర్ణించారు. విశ్వవిద్యాలయం దేశంలోనే ఉన్నతమైన ఐఐటీలతో పోటీపడి వాటికి దీటుగా సత్ఫలితాలు ఇస్తుందని అన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలను ఎన్నుకొని ఆయా రంగాలలో ఉన్నత ప్రతిభను చాటి చెప్పేలా కృషి చేయవలసిందిగా దిశా నిర్దేశం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో అభ్యసించిన విద్య ద్వారా తను ఎంతో మానసిక ధైర్యాన్ని, విజ్ఞానాన్ని, నైపుణ్యాలను పొందగలిగానని అన్నారు. భారత దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచి ఎన్నో కోట్ల మంది ఆకలిని తీర్చడాన్ని గర్వించదగిన అంశమన్నారు. ఈ ప్రయాణంలో ఆహార ఉత్పత్తి గణనీయంగా పెంచడంలో విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ, నేడు భారత దేశ వ్యవసాయంలో ఉత్పత్తి స్తబ్దత, పెరుగుతున్న సాగు ఖర్చులు, తరుగుతున్న నికర ఆదాయము, మారుతున్న వాతావరణ పరిస్థితులు, నిస్సారమైన భూములు వంటి అనేక సమస్యలు గమనిస్తున్నామని, ఈ సమస్యలను గమనించి సుస్థిరత సాధించడానికి సాగులో వైవిధ్యత ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం సేంద్రియ వ్యవసాయం వనరుల సంరక్షించే సాంకేతికతను ఆచరించడం బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు విశిష్టమైన వ్యక్తిత్వాన్ని అలవర్చుకొని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకొని తమ రంగాలలో అత్యున్నత ప్రతిభ కనబరుస్తూ సర్వతో ముఖావృద్ధి సాధించాలని సూచించారు. తొలుత కార్యక్రమానికి లేడీ గవర్నర్ సమీరా అబ్దుల్ నజీర్ తో కలిసి విచ్చేసిన రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయ కులపతికి వ్యవసాయ శాఖ కమిషనరు ఎస్ డిల్లీరావు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, ఉప కులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీ దేవి, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కామినేని శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. స్వర్ణ భారత్ ట్రస్టు ప్రజా మందిరం వెలుపల పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన ప్రజా మందిరంలో బోర్డు సభ్యులు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులతో గ్రూప్ ఫోటో దిగారు. తదుపరి ఆయనను ప్రత్యేక పోలీసు బ్యాండ్ మేళంతో వేదిక వద్దకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నరు కార్యదర్శి డాక్టర్ ఎం హరి జవహర్ లాల్, గవర్నర్ ఎడిసి మేజర్ అమన్ దీప్ సింగ్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు, ఇతర ప్రొఫెసర్లు, గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, కార్యక్రమ నోడల్ అధికారి షేక్ షాహిద్ బాబు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.ద

# బడా భూస్వాములే నీటి దొంగలు..?



అర్ధరాత్రి నీటి కాలువలపైఉన్న డ్యామ్ లను పగలగొడుతున్న వైనం.

నీటి కోసం బడా భూస్వాములు, చిన్న సన్నకారు రైతులు మధ్య పోరాటం.

చోద్యం చూస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

డ్యాములను పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు రైతులు విజ్ఞప్తి

నీరు సమృద్ధిగా విడుదల చేస్తే రైతుల మధ్య గొడవలు ఉండవంటున్న మండల ప్రజలు

కృత్తివెన్ను జులై 24 మేజర్ న్యూస్ : నీటి కోసం యుద్ధాలు జరుగుతాయి అంటే ఏమో అనుకున్నా గానీ ప్రస్తుతం నీటి కొరత వల్ల కృత్తివెన్ను మండలంలో రైతులు మధ్య ఇలాంటి గొడవలే జరుగుతున్నాయి. ప్రకృతి ప్రసాదించిన నీరు, గాలి, నిప్పు తదితర వాటి విలువ మనకు చాలాసార్లు తెలియడం లేదు. ఎందుకంటే అవి మనకు అడగకముందే అన్ని ఇస్తున్నాయి కాబట్టి మనిషి వాటిని పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ప్రకృతి విలయతాండవం చేస్తుండడంతో ప్రకృతి యొక్క విలువ ఏమిటి అనేది మనిషికి తెలుస్తుంది. ఇక వివరాలకు వెళితే కృత్తివెన్ను మండలంలో గత కొంతకాలంగా సాగునీటి కొరత ఏర్పడింది. దీంతో రైతులు మధ్య నీటి వివాదాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. మండలంలో చాలా గ్రామాలు రైతులు వ్యవసాం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని పంచాయితీలలో ఆక్వా సాగు విస్తారంగా కొనసాగుతుంది ఇటీవల కాలంలో వేరే ప్రాంతాల నుంచి బడా బాబులు మండలంలో చేపల, రొయ్యల చెరువులో ఏర్పాటు చేసుకొని విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో నీటి కొరత ఏర్పడడంతో చేపల, రొయ్యల చెరువుల రైతులకు వరి పండించే చిన్న సన్న కారు రైతులకు మధ్య నీటి తగాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మండలంలోని గరిశపూడి నుండి పడతడిక వరకు వెళ్లే చిన్న గొల్లపాలెం సబ్ ఛానల్ పై సుమారు ఐదు పంచాయతీల రైతులు ఆక్వా, వరి సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో బడ బాబులు నిడమర్రు గరిసిపూడి తదితర పంచాయతీలలో విస్తారంగా చేపల, రొయ్యల చెరువులు ఏర్పాటు చేసుకుని నీటి కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలోనే కృత్తివెన్ను మండలం శివారు ప్రాంతం కావడంతో సాగునీరు రావటం అంతంత మాత్రమే. అరకొరాగా వస్తున్న సాగునీటి కోసం రైతులు కుస్తీలు పడుతున్నారు. చిన్న గొల్లపాలెం సబ్ ఛానల్ నుండి తాడి వెన్ను కు వెళ్లే కాలువకు డ్యాం ఏర్పాటు చేశారు. అయితే బుధవారం రాత్రి బడా భూస్వాములకు సంబంధించిన కొందరు వ్యక్తులు సుమారు 8 మంది తాడివెన్నుకు వెళ్లే పంట కాలవపై ఉన్న డ్యామ్ ను డ్రిల్లింగ్ మిషన్ సాయంతో కింద ఉన్న బేస్మెంట్ ని తొలగించే ప్రయత్నం చేస్తుండగా



స్థానికులు రైతులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన కొందరు రైతుల అక్కడకు చేరుకుని డ్యాం పగలగొడుతున్న వారిని పట్టుకుని నిలదీసి అడిగితే వారు సరియైన సమాధానం ఇవ్వకపోవడంతో కృత్తివెన్ను పోలీస్ స్టేషన్లో వారిని అప్పగించినట్లు రైతులు తెలిపారు. సుమారు 120 ఎకరాల చెరువులకు సంబంధించిన బడా భూస్వామి తాడి వెన్ను పంట కాలువ నుండి పక్కనే ఉన్న చెరువులకు సుమారు మూడు అడుగుల తుములను ఏర్పాటుచేసి నేరుగా కాలువ నుండి చెరువులకు నీళ్లు తరలిస్తున్నారు. ఇంత తంతు జరుగుతున్న కనీసం నీటిపారుదల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విడ్డురంగా ఉంది. నీటి పారుదల శాఖ అధికారులు మండలంపై పర్యవేక్షణ కొరవడటంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. బడా బాబులు తలుచుకుంటే ఏదైనా చేయొచ్చు అనే నానుడి సమాజం లో కొనసాగుతుంది. చిన్న సన్నకారు రైతులు మాత్రం చేసేదిలేక అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమ గోడు వినిపించే ప్రయత్నం చేస్తు విఫలం అవుతున్నారు. డ్యాం బేస్మెంట్ పగలగొట్టిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని రైతుల కోరుతున్నారు. పగలగొట్టిన డ్యాం బేస్మెంట్ తిరిగి వెంటనే నిర్మించాలని కాలువ దిగువున ఉన్న రైతులను ఆదుకుని పూర్తిస్థాయిలో నీటి విడుదల జరిగేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు ఈ కార్యక్రమంలో చిన్నగొల్లపాలెం సబ్ ఛానల్ నీటి సంఘం ప్రెసిడెంట్ యాళ్ల రాజబాబు రైతులు సందు పెదకాపు, అరిటాకుల కృష్ణ, కాటూరి శ్రీనివాసరావు, అయ్యప్ప, నడకుదుటి తాతయ్య, ముకుంద్ పులగం అబ్బులు, కాటూరి కొండ, బుర్ర వంశీ, కొండ రైతులు పాల్గొన్నారు.

### ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా

# భారత్-యుకె ఎఫ్‌టిఏ 'మేక్ ఇన్ ఇండియా'కు కొత్త శకం



**విజయవాడ, జూలై 24, మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల అధికారిక బ్రిటన్ పర్యటన సందర్భంగా భారత్-యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై సంతకం చేయడాన్ని టివిఎస్ మోటార్ కంపెనీ ఈరోజు స్వాగతించింది. ఈ మైలురాయి ఒప్పందం 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 60 బిలియన్ డాలర్ల నుండి 120 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేస్తుందని భావిస్తున్నారు, ప్రధానమంత్రి విక్షిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. ముఖ్యంగా భారత ప్రభుత్వ ప్రధాన 'మేక్ ఇన్ ఇండియా' చొరవ కింద, భారతీయ తయారీ, డిజైన్ కోసం కొత్త ప్రపంచ సరిహద్దులను తెరవడానికి ఎఫ్‌టిఎ సిద్ధంగా ఉంది. టివిఎస్ మోటార్ కంపెనీకి, ఐకానిక్ బ్రిటిష్ బ్రాండ్‌ను వ్యూహాత్మకంగా కొనుగోలు చేసిన తర్వాత, యుకెలో నార్టన్ మోటార్‌సైకిల్స్ యొక్క కొత్త శ్రేణిని ప్రారంభించడానికి సిద్ధమవుతున్న సమయంలో ఈ ఒప్పందం వస్తుంది. ఈ ఎఫ్టీఏను స్వాగతిస్తూ, టీవీఎస్ మోటార్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణు మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ యొక్క విక్షిత్ భారత్ దార్శనికత, భారతదేశాన్ని ప్రపంచ తయారీ, డిజైన్ శక్తి కేంద్రంగా మార్చాలనే ఆయన అచంచలమైన నిబద్ధత మాకు ఎంతో ప్రేరణనిచ్చింది. భారతదేశం-యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడం ఒక కీలకమైన క్షణం - ఇది భారతీయ కంపెనీలు 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రపంచానికి తీసుకెళ్లడానికి కొత్త సరిహద్దులను తెరుస్తుంది. ఈ సంవత్సరం కొత్త నార్టన్ వాహనాలను ప్రారంభించడం పట్ల మేము చాలా సంతోషిస్తున్నాము, ఇది భారతదేశం, యుకె మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం ద్వారా ప్రయోజనం పొందుతుంది. ఇది మా ప్రపంచ ఆశయాలకు శక్తినిస్తుంది, ప్రపంచ స్థాయి ఉత్పత్తులు, బ్రాండ్‌లను నిర్మించాలనే మా సంకల్పాన్ని బలపరుస్తుంది." భారతదేశం-యుకె ఎఫ్టీఏ భారతీయ కంపెనీలు తమ ప్రపంచ పాదముద్రను విస్తరించడానికి అపారమైన అవకాశాలను సృష్టిస్తుందని, ఒక పెద్ద వేదికపై దేశం యొక్క ఆవిష్కరణ, ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అపారమైన అవకాశాలను సృష్టిస్తుందని టీవీఎస్ మోటార్ విశ్వసిస్తుంది.

# కృష్ణాజిల్లా గ్రంథాలయం చదరంగం పోటీల విజేత కొల్లా భావన్







**విజయవాడ మేజర్ న్యూస్ :** 135 అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా సరస్వతి సామ్రాజ్యం ట్రస్ట్, కృష్ణాజిల్లా గ్రంథాలయం వారు నిర్వహించిన కంబైండ్ కృష్ణాజిల్లాల చదరంగం పోటీలకు రెండు జిల్లాలలో నుంచి మారుమూల ప్రాంతాల నుంచి సుమారుగా 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌర గ్రంథాలయం సంచాలకులు ఏ కృష్ణమోహన్ ఈ పోటీలను ఘనంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయం లైబ్రేరియన్ గ్రేడ్ వన్ ఆఫీసర్ కె రమాదేవి, జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి మందుల రాజీవ్ ఈ పోటీలకు న్యాయ నిర్ణయతగా వ్యవహరించారు.

**విజేతలు :** కొల్లా భావన్ 7/7 పాయింట్లతో ప్రథమ, మాధవ సిహెచ్ 6/6 పాయింట్లతో ద్వితీయ, వేదాంత్ జి ఆర్ కే 6/6 తృతీయ స్థానంలో నిలిచారు. అంతేకా కుండా చిన్నారులను ఉత్తేజ పరచడం కోసం అండర్ 08,10, 12, 14 క్యా టగిరిలో మొదటి పది స్థానాలకు ట్రోఫీలు, మెడల్ సర్టిఫికెట్లతో సత్కరించారు.

# తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో జాషువా, కాటన్‌ల వర్ధంతి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నవయుగ కవితా వైతాళికుడు గుర్రం జాషువా, సర్ ఆర్థర్ కాటన్ ల వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ ల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా, కాటన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సామాజిక అసమానతలపై జాషువా సాగించిన అక్షర పోరాటాన్ని వక్తలు కొనియాడారు.. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,మండవ బాలవర్ధి,కర్రా సుధాకర్, మెండు లక్ష్మణరావు, మెగావత్తు గోపి, పర్చూరి దుర్గాప్రసాద్, మండలి రామ్మోహన్ రావు, దాసినేని శ్రీనివాసరావు, దాసినేని సాంబయ్య, కటికల బాలాజీ,షేక్ బాబావలి,ఉప్పల ప్రసాద్,నాగిడి రాంబాబు, చెన్ను బాబురావు, నాగిడి వెంకటేశ్వరరావు, బోలెం రామాంజనేయులు, బొర్రా శ్రీరాములు, కమ్మిలి సుబ్రమణ్యం, గోశాల బాలకోటయ్య, బచ్చు రాఘవయ్య, కొక్కిలిగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యూ జెడ్10ఆర్ స్మార్ట్‌ఫోన్ ఆవిష్కరణ




**విజయవాడ, జూలై 24, మేజర్ న్యూస్ :** ఐక్యూ తన తాజా స్మార్ట్‌ఫోన్ ఐక్యూ జెడ్10ఆర్ ను ఈ రోజు అధికారికంగా ఆవిష్కరించింది. సృష్టించడాన్ని, వ్యక్తీకరించడాన్ని, పంచుకోవడాన్ని ఇష్టపడే కొత్త తరం కంటెంట్ క్రియేటర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ డివైస్ కెమెరా, పనితీరు, డిజైన్ పరంగా పూర్తిగా లోడెడ్ అనుభూతిని అందిస్తుంది. ఐక్యూ జెడ్10ఆర్ ముఖ్యంగా దాని సెగ్మెంట్‌లో అగ్రస్థానంలో నిలిచే 32ఎంపీ 4కే ఫ్రంట్ కెమెరాతో అందరినీ ఆకర్షిస్తోంది. ఇది అద్భుతమైన సెల్ఫీలు, వ్లాగ్స్, రీల్స్ కోసం అత్యుత్తమంగా పని చేస్తుంది. ఇందులో ఏఐ ఎరేజ్, ఏఐ ఫొటో ఎన్హెన్స్, మల్టీ ఫోకస్ పోర్ట్రెట్, అండర్ వాటర్ మోడ్ వంటి స్మార్ట్ కెమెరా ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. వీటి వల్ల ఎప్పుడైనా ఎక్కడైనా కంటెంట్ సృష్టించడం ఎంతో సులభం అవుతుంది. ఈ ఫోన్ ఐపీ68 & ఐపీ69 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్ సర్టిఫికేషన్లతో మన్నికగా తయారయ్యింది. భారతదేశంలో అత్యంత సన్నని క్వాడ్-కర్వ్డ్ అమోలేడ్ డిస్ప్లే, 120హెచ్ జెడ్ రిఫ్రెష్ రేట్, 1800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ వలన వినియోగదారులకు ఓ అద్భుతమైన విజువల్ అనుభవాన్ని అందిస్తుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7400 5జి ప్రాసెసర్ ఆధారంగా పనిచేసే ఈ ఫోన్, 7.5 లక్షలకు పైగా అన్‌టుటు స్కోర్తో వేగవంతమైన పనితీరు అందిస్తుంది. ఇది మల్టీటాస్కింగ్, ఇమేజింగ్, ఏఐ సామర్థ్యాలను మెరుగుపరుస్తూ కంటెంట్ క్రియేటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఈ ఫోన్‌లో 5700ఎంఏహెచ్ భారీ బ్యాటరీ ఉంది, ఇది 44డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో గడిచే రోజంతా కంటెంట్ సృష్టించేందుకు శక్తిని అందిస్తుంది. 2 సంవత్సరాల సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, 3 సంవత్సరాల భద్రతా అప్‌డేట్లు ఈ డివైస్‌ను భవిష్యత్తుకు సిద్ధంగా ఉంచుతాయి.

ఇది ఆక్వామెరీన్, మూన్ స్టోన్ రంగులలో అందుబాటులో ఉంటాయి. జూలై 29న iQOO.com, Amazon.inలో. అమ్మకాలు ప్రారంభం ధర వివరాలు (నెట్ ఎఫెక్టివ్ ధరతో): 8జీబీ + 128జీబీ: రూ.19,499 (నెట్ ధర: రూ.17,499), 8జీబీ + 256జీబీ: రూ.21,499 (నెట్ ధర: రూ.19,499), 12జీబీ + 256జీబీ: రూ.23,499 (నెట్ ధర: రూ.21,499)



## డీలర్ శ్రీనుకు నివాళులర్పించిన యాసం చిట్టిబాబు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామానికి చెందిన సముద్రాల శ్రీనివాసరావు (డీలర్ శ్రీను) గుండెపోటుతో మరణించగా, విషయం తెలుసుకున్న తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు గురువారం శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీలర్ శ్రీనుగా అందరికీ సుపరిచితుడైన సముద్రాలు శ్రీనివాసరావు మృతి బాధాకరమని చిట్టిబాబు విచారం వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కనగాల సత్యంబాబు, దేగల రాఘవ, నాగిడి నాగేశ్వరావు, దోవారి ఏసు తదితరులు పాల్గొన్నారు.

## నాగ శ్రీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పాముకాటుకు గురై స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భావదేవరపల్లి మాజీ ఎంపిటిసి ముమ్మారెడ్డి సాంబ శివరావు సతీమణి నాగశ్రీని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. గురువారం నాగాయలంక మండల పరిధిలోని భావదేవరపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, నాగాయలంక పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు ముమ్మారెడ్డి సాంబశివరావు (చంటి) సతీమణి నాగశ్రీ పాముకాటు గురై అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి నాగశ్రీని పరామర్శించారు. ఈయనతో పాటు రాజనాల మాణిక్యాలరావు, నలకుర్తి పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాటన్ దొర, గుర్రం జాషువాల వర్ధంతి వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నేటి తరానికి ఆదర్శనీయులైన సార్ ఆర్థర్ కాటన్ దొర, ప్రముఖ కవి గుర్రం జాషువాల వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాటన్, జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కాటన్ దొర సాగునీటి ఇంజినీరుగా లక్షలాది ఎకరాలు సుభిక్షం చేస్తే, గుర్రం జాషువా సమాజాన్ని చైతన్యపరిచే రచనలు చేశారన్నారు.కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, గాంధీ క్షేత్రం సభ్యులు యలవర్తి నాగ మునేశ్వరరావు (చిన్న), కొండవీటి పాండురంగారావు, కొట్టే విజయ్, గరికపాటి శ్రీనివాసరావు, తుంగల శ్రీనివాసరావు, గరికపాటి హరి బాబు, నీటి సంఘం అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, కూటమి నాయకులు ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), తోట రాంబాబు, కొండవీటి నాగేశ్వరరావు, బచ్చు కృష్ణారావు, భోగాది బాలకృష్ణ, తోట లక్ష్మణరావు, హరిబాబు, మైలా హరిబాబు పాల్గొన్నారు.

## సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ



**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మాగాణి పొలాల గట్లపై కంది విత్తనాలను నాటేందుకు నూరు శాతం సబ్సిడీ రాయితీపై రైతులకు కంది విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందించారు. అందులో భాగంగా కూచిపూడి సచివాలయంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి. సురేష్ బాబు నాయక్ ఆధ్వర్యంలో నూరు శాతం సబ్సిడీ పై కంది విత్తనాలను కూచిపూడి గ్రామంలో రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు ఎం శ్రావణి పలువురు రైతులు పాల్గొన్నారు.



### కట్టుబడిపాలెం - కవులూరు

## బీటీ రహదారి అభివృద్ధికి శంకుస్థాపన

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కట్టుబడిపాలెం నుంచి కవులూరు బీటీ రహదారి అభివృద్ధి పనులకు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ రహదారి అభివృద్ధికి నాబార్డు నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలోనే రహదారుల అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా ఈ రహదారిని అభివృద్ధి చేయాలని గుత్తేదారుకు సూచించారు. అనంతరం పినపాక గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## మాజేరు వంతెన వద్ద గుర్రపుడెక్క తొలగింపు పూర్తి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం కొత్తమాజేరులో గుండేరు వంతెన అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ పనులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పరిశీలించారు. గురువారం ఉదయం కొత్త మాజేరులో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గ్రామస్థులు, అధికారులతో మాట్లాడారు. ఆర్.అండ్.బీ శాఖ ఆధ్వర్యంలో దొనబండ క్వారీ నుంచి తెచ్చిన భారీ కొండ రాళ్లతో గండిని పూడ్చటంతో పాటు, వంతెనకు ఇరువైపులా మరోసారి కోత ఏర్పడ కుండా రివిట్‌మెంట్ పటిష్టంగా చేయాలని సూచించారు. గుండేరు మేజర్ డ్రైనేజీ ఎగువ నుంచే కాకుండా, గుండేరు పరిధిలోని మీడియం, మైనర్ డ్రైనేజీల నుంచి మాజేరు వంతెన వద్దకు కొట్టుకువచ్చి పేరుకుపోయిన గుర్ర పు డెక్క తొలగింపు పనులను నిరంతరాయంగా నిర్వహించి పూర్తి చేసిన డ్రై నేజీ శాఖ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ డీ.వెంకటేశ్వరరావు, డీఈఈ బాబూ నాయక్, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతి, నాయకులు బొర్రా అగ్గిరాముడు, కమ్మిలి పెదబాబు, నాగార్జున పాల్గొన్నారు.

## హద్దులు దాటుతున్న పెనుగంచిప్రోలు మున్నేరు ఇసుక



**పెనుగంచిప్రోలు, జులై 24, మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు మొన్నేరు నుండి అక్రమంగా ఇసుక రవాణా అవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటంలో ఉన్నటువంటి ఆంతర్యం ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదని గుసగుసలు. పోలీస్, రెవెన్యూ, మున్నేరు అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. ముడుపులు చెల్లుతున్నాయి అందుకే పట్టించుకోవడం లేదని పలువురు ప్రతినిధులు వాపోయినా వీరు దాడులు చేసిన సంఘటనలు లేవు. గురువారం సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవ ప్రభుత్వ సంపద అక్రమంగా తెలంగాణకు తరలి వెళుతుందని పత్రికా ముఖంగా ప్రకటించినా అధికారులు పట్టించుకోవడం లేదు కారణం ఏమిటి అని ఆయన విమర్శిస్తున్నారు.నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూడా దీనిని ఖండించకపోవడంలో ఉన్నటువంటి ఆంతర్యం ఏమిటి.ఈ సవా లక్ష ప్రశ్నలకు నియోజకవర్గ టిటిడి నాయకులు, అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని పెనుగంచిప్రోలు మండల ప్రజలు భావుటంగానే కోరుతున్నారు. ఆ వాహనాలకు ఎలాంటి నెంబర్ ప్లేట్లు ఉండవు. కనీసం ఎక్కడైనా జరగడానికి జరిగితే వారిని పట్టుకోడానికి కూడా వీలు ఉండదు.దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పెనుగంచిప్రోలు పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.

# టీడీపీ ఆదేశిస్తే పేదలకు ఉచిత ఇసుక పంపిణీ చేస్తాను



### సేవ చేస్తానని ముందుకు వస్తున్న వారిని ప్రోత్సాహించని టీడీపీ అధిష్టానం

### నూతలపాటి చెన్నకేశవ..

**పెనుగంచిప్రోలు, జులై 25,మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. అవినీతిని వే ళ్ళతో పెగిలించొచ్చని ఆశించిన సీనియర్ నాయకులు నేడు బంగపాటుకు గురి అయ్యారు. ఆశించిన ఫలితాలు రాకపోయినా కాలగమనంలో కార్యకర్తల్లోనూ నాయకుల్లోనూ నిరుత్సాహం పెరుగుతుంది. దీనికి అధిష్టానం ఎందుకు అడ్డుకట్ట వేయటం లేదు అని అటు ప్రతిపక్షాలు, ఇటు అధికార పార్టీలోని నాయకులు కార్యకర్తలు గుసగుసలు. సీనియర్ నాయకులు ఆధ్యాత్మికంగా సామాజికంగా అనేక సేవలు చేసిన నాయకుడికి ఇంత ఇబ్బందిగా ఉంటే సామాన్య కార్యకర్తలు నాయకులు ఇంకెంత ఇబ్బందులు ఫాలో అవుతున్నారో అధిష్టానం వెంటనే ఆలోచించుకోవాలి అని పెనుగం చిప్రోలు గ్రామంలో గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ శ్రీ తిరుపతమ్మ అమ్మవారిదేవస్థానం చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు. నేను ఒక కార్యకర్తగానే స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ మాజీ మంత్రి నెట్టెం రఘురాం కు పెనుగంచిప్రోలు మండలంలో జరుగుతున్నటువంటి వివిధ అవినీతి,అక్రమాలపై ఏకరువు పెట్టానని కానీ వారి ఆగడాలకు అంతు లేకుండా పోవడం చేత చాలా నిరుత్సాహానికి గురవుతున్నానని ఆయన ఆవేదన చెందారు. అధిష్టానం కార్యకర్తనైన చెన్నకేశవ కి అవకాశం ఇస్తే పెనుగంచిప్రోలు మునేటిలో ఇసుక ఇల్లు నిర్మించుకొనే వారికి, పేదలకు ఉచితంగా ట్రాక్టర్‌లకు లోడింగ్ చేపిస్తాను.ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ట్రాక్టర్లకు లోడ్ చేస్తాను. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ వారి ఆదేశాను సారముగా మండలంలో ప్రతి పేదవాడు ఆనందంగా ఇల్లు నిర్మించుకుంటాడు. అక్రమంగాతెలంగాణ కు లోడ్ చేయను ధనరాశులుగా ఉన్నటువంటి ఇసుక అక్రమంగా తెలంగాణకు వెళ్తుంటే తట్టుకోలేకపోతున్నా మని పెద్దలైన మీరు అనుమతిస్తె నేను ఉచిత ఇసుకను లోడింగ్కు సిబి సమకూర్చుకుంటాను. ఒక్కసారి అవకాశం కల్పించమని నూతల పాటి. చెన్నకేశవ అధిష్టానాన్ని చెన్నకేశవ చేసినవిన్నపమును పరిశీలించి అవకాశం ఇప్పిస్తారు అని శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య ని, నెట్టెం రఘురాం.కే డీసీసీ బ్యాంకు ప్రెసిడెంట్.తెలుగుదేశం జిల్లా.పార్టీ ప్రెసిడెంట్‌ని కోరుకుంటున్నాను. అని చెన్నకేశవ పత్రికా ప్రకటనలో తెలిపారు.

## హైస్కూల్‌కు ఐడిబిఐ బ్యాంక్ జోనల్ మేనేజర్ వితరణ



**పామర్రు జులై 24 మేజర్ న్యూస్ :** పామర్రు లోని శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడిబిఐ బ్యాంకు జోనల్ మేనేజర్ ఎం.జానకిరామన్ పలు వస్తువులను వితరణ చేశారు. గురువారం ఆయన తమ బ్యాంకు సిబ్బందితో కలిసి పాఠశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కోసం 500 స్టీల్ ప్లేట్లు, 25 కుర్చీలు, 20 టేబుల్స్,10 సీలింగ్ ఫ్యాన్లు, సౌండ్ సిస్టం అందజేశారు. వీటి విలువ మొత్తం 1,76 వేల రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ వస్తువులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జానకిరామన్ మాట్లాడుతూ తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే పదవ తరగతి వరకు చదివి ఉన్నత స్థానానికి ఎదిగానని తెలిపారు.అందుకే తనకు ప్రభుత్వ పాఠశాలలంటే ఎంతో ఇష్టమని ఆ కారణంగానే ఈ పాఠశాలకు వితరణ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తమ పాఠశాలకు వారు కూడా ఇదేవిధంగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సాయికృష్ణ, ఉయ్యూరు బ్రాంచ్ మేనేజర్ కె. అనుదీప్ సాగర్, అసిస్టెంట్ మేనేజర్ బి.ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతృత్వం తో ముందుకు వచ్చిన జానకిరామన్, ఐడిబిఐ బ్యాంక్ సిబ్బందిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## పలు గ్రామాలలో స్వచ్ఛ సర్వేక్ష గ్రామీణ బృందం సర్వే



**పమిడిముక్కల జూలై 24 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తాడంకి, గురజాడ, వేల్పూరు గ్రామాలలో స్వచ్ఛ సర్వేక్ష గ్రామీణ బృందం గురువారం విస్తృతంగా పర్యటించింది. బృందం సభ్యులు తాడంకి గ్రామంలో జె.శివ, గురజాడ లో సందీప్, వేల్పూరు గ్రామంలో శ్రీనివాస్ లు సర్వే నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, సచివాలయాలను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలపై ప్రజల నుండి వివరాలు సేకరించడం తో పాటు రికార్డులను పరిశీలించారు. ఆయా గ్రామాలలోని కొంతమంది గృహ యజమానులతో ప్రత్యేకంగా మాట్లాడి వివరాలు నమోదు చేశారు. పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణ, డ్రైనేజి సమస్య లపై క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. స్వచ్ఛ సర్వేక్ష సర్వే యొక్క ఆవశ్యకతను ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. తాడంకి లో జరిగిన సర్వే లో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీర్ల సీతారామరాజు, ఇ.ఓ.ఆర్.డి డి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఇ.భవాని, సర్వే కో - ఆర్డినేటర్లు బాపూజి, ఏసుబాబు, సచివాలయ సిబ్బంది బి. నాగరాజు, పి.అనుష, ఎండి.చాందిని, ఆర్.లక్ష్మి, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టుకి ఆత్మీయ సత్కారం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** బాల్యం నుండి ఐదు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ పరుచూరి శ్రీనివాసరావును కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి తరపున ఘనంగా సత్కరించారు. సిపిఐ వందేళ్ల పండగ సందర్భంగా ఇటీవల గన్నవరంలో జరిగిన కృష్ణాజిల్లా 26వ మహాసభలో కృష్ణా జిల్లా సమితి ఐదుగురు సీనియర్ కమ్యూనిస్టులను సత్కరించాలని సంకల్పించింది. ఈ సభకు అనారోగ్య కారణాలవల్ల అవనిగడ్డ నియోజకవర్గం మంగళాపురం గ్రామానికి చెందిన కామ్రేడ్ పరుచూరి శ్రీనివాసరావు హాజరు కాకపోవడంతో జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు నేతృత్వంలో చల్లపల్లి లోని శ్రీ చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆయనను ఘనంగా సత్కరించి మెమొంటోను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కమ్యూనిస్టు యోధ కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు స్వగ్రామమైన మంగళాపురం నుండి విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితులై అలహాబాద్ యూనివర్సిటీలో బీఎస్సీ చదువుతున్న నేపథ్యంలో విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కామ్రేడ్ పరిచూరి శ్రీనివాసరావు తిరిగి గ్రామానికి వచ్చి కమ్యూనిస్టు ఉద్యమంలో మమేకమయ్యారు. నాటినుండి నేటి వరకు ప్రజా ఉద్యమంలో ఐదు దశాబ్దాల పాటు కొనసాగుతూ దివి ఏరియా కమిటీ కార్యవర్గ సభ్యునిగా, కృష్ణా జిల్లా కార్యవర్గ సభ్యునిగా వివిధ బాధ్యతల సమర్థవంతంగా నిర్వహించారు. వంద సంవత్సరాల కమ్యూనిస్టు చరిత్రలో తన దంటూ ప్రత్యేక పాత్ర నిర్వహించి ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచారు. రైతు కుటుంబంలో పుట్టిన ఆయన రైతు ఉద్యమ నేతగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దివి అధ్యక్షునిగా, జిల్లా రైతు సంఘం నేతగా, రైతాంగ హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాటాలు చేశారు. లక్ష్మీపురం లోని కెసిపి చెక్కరకర్మాగారం షుగర్ కేన్ అసోసియేషన్ అధ్యక్షునిగా సుదీర్ఘకాలం పాటు పని చేసి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కమ్యూనిస్టు పార్టీ నేతగా మంగళాపురం గ్రామ సర్పంచ్ గా గ్రామ అభివృద్ధిలో నూతన వరవడికి నాంది పలికి కమ్యూనిస్టు పార్టీ ముద్ర వేశారు. చల్లపల్లి భూ పోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు జ్ఞాపకార్థం చల్లపల్లి లో నిర్మించిన సిఆర్ వికాస కేంద్రం నిర్మాణం కోసం అంకితభావంతో పని చేస్తూ నేటికీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు చరిత్రలో ఉవ్వెత్తున సాగిన చల్లపల్లి మిగులు భూముల పోరాటం లో శ్రీనివాసరావు పాత్ర మరువలేనిది.సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, రైతు నేతగా కొనసాగిన శ్రీనివాసరావు ను సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సి ఆర్ వికాసకేంద్రం ట్రస్ట్ సభ్యులు మేక నరసింహారావు,మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కంఠంనేని జోత్స్నా దేవి, విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు లు పాల్గొన్నారు.

# చెరువును తలపిస్తున్న ఘంటశాల, రామానగరం ఆర్. అండ్.బి.రోడ్డు



**అధికారులు స్పందించి వెంటనే రోడ్డు వెయ్యాలి**

**2 కి.మీ. వరకు రోడ్డు మరమ్మత్తులు చేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**

**రూ. 5 కోట్లు నిధులు మంజూరు అయినా ఈ రోడ్డుకి దుస్థితి**

ఘంటసాల, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన ఘంటశాల ప్రధాన రహదారి రామానగరం వయా ఘంటశాల కొడాలి ఆర్.అండ్.బి రోడ్డుకు కొంత భాగం మరమ్మత్తులు చేసి మరికొంత భాగం విస్మరించారనీ రాష్ట్ర బి.సి. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు అందె జగదీష్ గురువారం ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ ఆర్. అండ్.బి. చల్లపల్లి ఏ.ఈ, అవనిగడ్డ సబ్డివిజన్ డి.ఈ, ఒక్కసారి ఈ రోడ్డును పరిశీలించాన్నారు. రామానగరం నుంచి ఘంటశాల వస్తుండగా దేవరకోట చిల్లలవాగు వంతెన ప్రదేశంలో రోడ్డు పై పెద్ద పెద్ద గోతులు పడి ద్విచక్ర వాహన దారులు, ఆటోలలో ప్రయాణించి ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారన్నారు. ఈ రోడ్డు ఘంటశాల పాత పోలీస్ స్టేషన్ వరకు పూర్తిగా గోతులు పడి, వర్షం పడినప్పుడు వర్షపు నీరు రోడ్డు పై చేరి చెరువును తలిపిస్తుందన్నారు. ఈ వర్షపు నీరు రోడ్డు పై చేరటంతో ప్రజలు, వ్యవసాయ కూలీలు, చదువుకునే విద్యార్థులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి నిత్యం ఈ రోడ్డు మార్గం ద్వారానే చల్లపల్లి రామానగరం వ్యవసాయం చేసుకునేవారు ఈ రోడ్డు పై వెళ్ళే వారు తీవ్ర అసౌకర్యానికి గురౌవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అధ్వానంగా ఉన్న రోడ్డును కొంత మేర అభివృద్ధి చేశారనీ, స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చొరవ తీసుకొన్ని మిగతా 2 కి.మ ఈ. ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలన్నారు. ఈ రోడ్డుకు రూ. 5 కోట్లు మంజూరు అయినట్లు చెబుతున్నారు. కానీ ఇంతవరకు ఏమాత్రం రోడ్డు వేయకపోవటం చాలా బాధాకరమన్నారు. పాత పోలీస్ స్టేషన్ వద్ద డ్రైనేజ్ సౌకర్యం లేకపోవటంతో ఆర్. అండ్.బి. ఏ.ఈ, డి.ఈ పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా ప్రొక్లెన్లతో రోడ్డును బద్దలు కొట్టి గుంతలుగా ఉన్న రోడ్డును సమానంగా వెయ్యాలనీ ఈ రహదారి పై ఉన్న నీరు పోవటానికి రోడ్డుకు ఇరువులా సైడ్లు తీసి నీరు బయటకు వెళ్ళ విధంగా చర్యలు తీసుకోవాలనీ రాష్ట్ర బి.సి. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు అందె జగదీష్, మండల జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యార్ల శ్రీకాంత్ తదితరులు పేర్కొన్నారు.

## వేకనూరు సూర్య దేవాలయంలో ఆదిత్య హోమం



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఉషా పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామివారి ఆలయ ఆవరణలో ఆదిత్య హోమం వైభవంగా నిర్వహించారు.గురువారం ఆషాడ బహుళ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని బెంగళూరు నగరానికి చెందిన ఉమామహేశ్వరరావు దంపతులు ఆదిత్య హోమం నిర్వహించగా ఆలయ ప్రధాన అర్చకులు దీవి నరసింహారామూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారికి చందనముతో అలంకరించగా భక్తులకి దర్శనం ఇచ్చారు ఈ కార్యక్రమాలలో వేలాదిగా భక్తులు పాల్గొని తీర్థ అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న అన్నప్రసాద వితరణకు వేదాంతం రాంబాబు రోహిణి (మస్కట్), చీకటి రాజగోపాల్ రావు, అరుణకుమారి దంపతులు ఆర్థిక సహాయం అందజేశారు ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు భక్తులకు కావలసిన ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించారు.



## తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య



నందిగామ, జులై 24, మేజర్ న్యూస్: కలియుగ వైకుంఠంగా పిలవబడే పవిత్రమైన తిరుమల క్షేత్రంలో గురువారం (నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాల కోసం, రైతాంగం వృద్ధి చెందడం కోసం, రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు వృద్ధి చెందాలని, ముఖ్యంగా కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమ దిశగా శరవేగంగా పురోగమించాలని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తంగిరాల సౌమ్య ప్రార్థిం చారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనం, ప్రత్యేక పూజ లు నిర్వహించిన ఆమె, రాష్ట్ర ప్రజలందరూ శాంతి, ఐశ్వర్యంతో జీవించాలని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సాధించి, సమస్త రంగాలలో అగ్రగామిగా నిలవాలని స్వామివారి ఆశీస్సులు కోరారు. ఈ దర్శనం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు దైవ ఆశీస్సులు లభించాలనే సదుద్దేశంతో జరిగినట్లు తెలు స్తోంది. ఈ దర్శనం, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి లక్ష్యం గా పనిచేస్తున్న తరుణంలో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పురోగతికి ఒక ఆధ్యాత్మిక ప్రయత్నంగా భావించవచ్చు అన్నారు.

# కోటా శ్రీనివాసరావుకు మచిలీపట్నం సాంస్కృతిక స్వచ్ఛంద సంస్థల నివాళులు



మచిలీపట్నం మేజర్ న్యూస్ : మనం మరువలేని మహానటుడు నవ రసాలను అద్భుతంగా ప్రదర్శించగల విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు అని సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. మచిలీపట్నం భావతరంగిణి ఆధ్వర్యంలో స్థానిక చిత్రకళా సంసద్ భవనంలో గురువారం సాయంత్రం కోట శ్రీనివాసరావు సంస్మరణ సభ జరిగింది. బాలాజీ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ తెలుగు కన్నడ తమిళ హిందీ మలయాళం భాషల్లో750 చిత్రాలలో నటించి అనేక అవార్డులు, పద్మశ్రీ బిరుదు అందుకున్నారన్నారు. సినీ రంగంతో పాటు శాసనసభ్యులుగా రాజకీయ రంగంలో కూడా మంచి సేవలు అందించారనీ బాలాజీ అన్నారు. నట జీవితంలోను రాజకీయ జీవితంలోను నిజాయితీగా పనిచేసిన కోటకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇవ్వడం సముజతమని బాలాజీ అన్నారు. సామాజిక సేవా కార్యకర్త పి.వీ. ఫణికుమార్ మాట్లాడుతూ కోట గొప్ప నటుడే కాదు గొప్ప రాజకీయ నాయకుడు మాత్రమే కాదు వాటిని మించిన గొప్ప మానవతావాది అని అన్నారు. ఆయన మరణం ప్రతి ఒక్కరిని బాధించిందని అన్నారు. భావ తరంగిణి అధ్యక్షులు భవిష్య మాట్లాడుతూ కోట శ్రీనివాసరావు సినీ చరిత్రలో తనకంటూ పేజీ ఏర్పాటు చేసుకున్నారని ఆయన మరణం సినీ లోకానికి తీరని లోటు అని అన్నారు. ప్రాణం ఖరీదుతో తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించిన కోట శ్రీనివాసరావు ప్రతిఘటన సినిమాలోని పాత్రతో తనదైన శైలిని తన ప్రతిభను నిరూపణ చేశారని టీవీ యాంకర్ పి. శాంతి అన్నారు.భారతీయ జనతా పార్టీలో విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యునిగా పనిచేసిన కోట శ్రీనివాసరావు నేటి యువతరానికి ఆదర్శప్రాయం అని జనజీవన స్రవంతిలో కలిసిన మహనీయుడు కోట అని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు అన్నారు. ఈ కార్యక్రమంలో దూళిపాల శ్రీరామ్ చంద్ర మూర్తి, ఐటిఐ కాలేజీ కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్, వెనిగళ్ళ ఉమామహేశ్వరరావు, జె. శేఖర్, అంబడిపూడి నాగలక్ష్మి, సూరి శెట్టి హరికృష్ణ తదితరులు కోట శ్రీనివాసరావు గొప్పతనం గురించి మాట్లాడారు. కోట శ్రీనివాసరావు కాంశ్య విగ్రహాన్ని కృష్ణాజిల్లా కంకిపాడు మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేయాలని వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వడ్లమన్నాడును సందర్శించిన ఎంపీడీఓ ఇమ్రాన్



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్: గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామపంచాయితీని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్ సందర్శించి పలు విషయాలను పరిశీలించారు. డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎజె ఎల్ నరసింహారావుతో కలసి వడ్లమన్నాడు పంచాయితీని సందర్శించిన ఎంపిడిఓ ఇమ్రాన్ హౌస్ టాక్స్ డేటా ప్యూరిఫికేషన్ ఎలా జరుగుచున్నదో పరిశీలించారు. అనంతరం ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంక్ లో క్లోరినేషన్ చేస్తున్న విషయాలను పరిశీలించి, మంచినీటి సరఫరా తీరు తెన్నులు, మంచినీటి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఇంటింటికీ వెళ్ళి పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్న తడిచెత్త, పొడిచెత్త సేకరణలను పరిశీలించి పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.




## మున్నేరులో నీరు 12 అడుగులకు చేరుకోవచ్చు

**అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండండి**



పెనుగంచిప్రోలు, జులై 24, మేజర్ న్యూస్ : పెనుగంచిప్రోలు వద్ద ఉన్న మున్నేరు ఉదయం ఉధృతంగా ప్రవహించే మధ్యాహ్నం కల్లా కొంత శాంతించినా ఖమ్మం జిల్లా నుండి గురువారం సాయంత్రం నాటికి వరద నీరు పెరిగే అవకాశం ఉందని ఆశిస్తున్నాము.అనకట్ట వద్ద, స్థాయి 12 అడుగులకు చేరుకుంటుంది. మిగులు ఉత్పత్తి 45,000 క్యూసెక్కులకు చేరుకుంటుంది. లింగాల వంతెన పైన నీటి ప్రవాహం వెళుతుంది, కాబట్టి దయచేసి సంబంధిత విభాగం అధికారులను అప్రమత్తం చేసుకోండి. అని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మునియేరు బ్యారేజ్ విభాగం,పొలంపల్లి నీటి వనరుల విభాగం వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## స్వచ్ఛ సర్వే రక్షణ గ్రామీణ బృందం తనిఖీ



మొవ్వ మేజర్ న్యూస్: మండల కేంద్రమైన మొవ్వలు లో గురువారం స్వచ్ఛ సర్వే రక్షణ గ్రామీణ బృందం గ్రామంలో పలు ప్రాంతాలు పర్యటించి గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానంపై తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు నిర్వహణ తదితర అంశాలపై గ్రామంలో బృందం గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్వచ్ఛ సర్వే రక్షణ గ్రామీణ బృందం పర్యవేక్షకులు జి రవివర్మ పర్యవేక్షణలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ కె పవన్ కుమార్, డిప్యూటీ ఎంపిడిఓ ఎం. ఎస్. కె పరమాత్మ, పంచాయతీ కార్యదర్శి కెవి సోమేశ్వరరావు, అంగన్వాడి సూపర్వైజర్ వై పుణ్యవతి, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ఏ మహేష్ కుమార్ తదితరులు పర్యటించిన బృందంలో ఉన్నారు.

## నేడు కౌతవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు మేజర్ న్యూస్: ది.25/07/2025 అనగా శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం1 గంట వరకు 33/11 కె.వి కౌతవరం సబ్ స్టేషన్లో గల 11కెవి కౌతవరం ఫీడర్ పరిధిలోని కౌతవరం గ్రామములో విద్యుత్ లైన్స్ నకు దగ్గరలో చెట్లను కొట్టడం జరుగుతుంది. కావున కౌతవరం గ్రామములోని గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారు లకు పైన చెప్పబడిన సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుంది. కావున ప్రజలందరు సహకరించవలసిందిగా ఏపిసిపిడిసిఎల్ గుడివాడ డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి.శ్రీనివాసరావు కోరడమైనది.

## ఎల్.ఓ.సి అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన బోగ్యం స్వరకుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి శస్త్రచికిత్సల నిమిత్తం రూ.3,40,000లు ఇటీవల లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఎల్.ఓ.సిని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు గొల్లపూడిలోని శాసనసభ్యుని కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. గొల్లపూడి ఏ.ఎం.సి చైర్మన్ నర్రా వాసు, తదితరులు పాల్గొన్నారు.

## బురదమయంగా మారిన రహదారిపై సౌకర్యం కల్పించిన టిడిపి నాయకుడు శ్రీనివాసరావు




**తోట్లవల్లూరు జులై 24 మేజర్ న్యూస్ :** గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని తోడేళ్లదిబ్బ లంక గ్రామస్తులు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పూర్తిగా బురదమయం కావడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, అలాగే రైతులు రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు రవి శ్రీనివాసరావు విద్యార్థులు, రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి స్వయంగా రోడ్లపైకి ట్రాక్టర్ తో బుసుక ను తోలించి రహదారి సౌకర్యాన్ని బురద లేకుండా కొంతమేరకు శుభపరిచారు. దీంతో రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక కృషి



**పామర్రు జులై 24 మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అందిస్తున్న సేవలు అభినందనీయమని భారతీయ జనతా పార్టీ పామర్రు మండల పార్టీ అధ్యక్షులు ముదునూరు శివకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పామర్రులోని శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు వచ్చిన టూల్ కిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన విద్య, పౌష్టిక ఆహారాన్ని అందించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి స్కిల్స్ ను కూడా అందిస్తున్నారని, ఇది భవిష్యత్తులో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ విధంగా ఆలోచించి అందుకు అనుగుణంగా పాఠశాలలలో విద్యాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తోందని దీనిలో భాగంగా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## చంద్రాల సచివాలయ సిబ్బందికి సత్కారం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం చంద్రాల సచివాలయం నుండి బదిదిలీపై వెళ్ళిన సిబ్బందిని గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు గురువారం సత్కరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చంద్రాల సచివాలయ కార్యదర్శి సిహెచ్. రాజేష్, సర్వేయరు రవళి, డిజిటల్ అసిస్టెంట్ గోపాల్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాము, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మణికంఠ, ఎంఎస్కె శ్రీలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియదర్శిని, ఎఎన్ఎమ్ ప్రసన్నరాణి తదితరులను దుశ్శాలువాలతో సత్కరించి, గ్రామానికి అందించిన సేవలను అభినందించారు. అలాగే నూతనంగా సచివాలయానికి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన సిబ్బందికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిశెట్టి అర్జునరావు, ఉప సర్పంచ్ నందం శ్రీనివాస రావు, కార్యదర్శి రాజేంద్ర, గ్రామ పెద్దలు, ప్రముఖులు అడుసుమిల్లి రామ్మోహనరావు, నిమ్మగడ్డ కుటుంబ రావు, అడుసుమిల్లి దీపక్, గ్రామ రెవెన్యూ అధికారి సనకా భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అవనిగడ్డ ఎం.ఈ.ఎఫ్, అధ్యక్షుడుగా కొక్కిలిగడ్డ రమేష్ బాబు







చల్లపల్లి మేజర్ న్యూస్ : అవనిగడ్డ నియోజవర్గము మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గా కొక్కిలిగడ్డ. రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అని ఎం.ఈ.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు విక్టర్ బాబు తెలిపారు.ఆదివారం నాడు చల్లపల్లి లోని ఎన్ టి ర్ పార్క్ ఆవరణలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్ బాబు పాల్గొని నూతన కమిటీ ను ప్రకటించారు. ఈ కమిటీ లో కొక్కిలిగడ్డ రమేష్ బాబు అధ్యక్షుడు గా, సిద్దెల.–యలమందయ్య జనరల్ సెక్రటరీ గా కొల్లూరు మోహనరావు కోశాధికారిగా ఏకగ్రీవంగా ప్రకటించడం జరిగింది.

ఈ సందర్భంగా విక్టర్ బాబు మాదిగ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కమిటీ ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆదేశాలను గ్రామ స్థాయిలో తీసుకెళ్లి జాతి బిడ్డల అభివృద్ధి కి అండగా నిలవాలని అన్నారు.మాదిగ జాతి అభివృద్ధి చెందాలంటే మాదిగ ఉద్యోగులంతా ఏకతాటిపై నిలిచి జాతి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో,జిల్లా ఎం వి ఫ్ గౌరవ అధ్యక్షులు రావెళ్ల వరుణ్ కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ బొకినాల కృష్ణ,, జిల్లా జనరల్ సెక్రటరీ బీడెల్లి మరియకుమార్, జిల్లా ట్రెజరర్ రాచపూడి బాలస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ కారుమూరి వెంకయ్య, జయప్రకాష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా కూటమి పాలన



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా పరిపాలన సాగిస్తూ ప్రజామన్ననలు పొందుతున్నట్లు చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారిలు అన్నారు. సుపరిపాలనకు తొలిఏడాది కార్యక్రమం గురువారం చల్లపల్లి మం డల పరిధిలోని పాగోలు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారు. ఒకేసారి ఫించన్ పెంపు, ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం పథకాలను అమలుచేసిన ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచీ మహిళలకు ఉచిత బస్సుప్రయాణం కల్పించనుందని నేతలు తెలి పారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ విధ్వంసం నుంచీ అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నట్లు చెప్పారు. రాజధాని నిర్మాణం, యువతకు ఉద్యోగాల కల్పన, పీ–4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలన తదితర ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలను ప్రజలకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ఛార్జిలు మల్లంపల్లి శివరామకృష్ణ, మోర్ల శివ, నేతలు షేక్ నబీఘోరి, కనుమూరి వెంకటేశ్వరరావు, కోట సత్యనారాయణ, పరుచూరి రమణ, పైడిపాముల రాజేంద్ర, పఠాన్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## గుండేరు మేజర్ డ్రైనేజీ పరిశీలించిన ఎమ్మెల్యే



ఘంటసాల, మేజర్ న్యూస్ : ఘంటసాల మండలం దేవరకోటలో గుండేరు మేజర్ డ్రైనేజీని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం పరిశీలించారు. వంతెన వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఇక్కడ గుర్రపు డెక్క తొలగింపు దాదాపు పూర్తి చేసినట్లు డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు తెలిపారు. మిగిలిన కొంతమేరకు పని చేయాల్సి ఉందని తెలిపారు. ఆయన వెంట పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబు నాయక్ ఉన్నారు.

**వేమూరి విశ్వేశ్వరరావుకు పరామర్శ:** ఘంటసాలలో గ్రామ ప్రముఖులు వేమూరి విశ్వేశ్వరరావును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. ఇటీవల స్వల్ప రోడ్డు ప్రమాదానికి గురైన విశ్వేశ్వరరావు చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్నారు. ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఉన్నారు.



## సుపరిపాలలో తొలిఅడుగులో పాల్గొన్న ఎమ్మెల్యే



**పామర్రు జులై 24 మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ గాంధీనగర్లో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి ఆయన ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని, వాటిని అధిగమించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే పలుచోట్ల గ్రామాల్లో సిసి రోడ్లను నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా కొన్ని పథకాలను ప్రజలకు అందించడం జరిగిందన్నారు. మిగిలిన పథకాలను కూడా త్వరలోనే అందించేందుకు ప్రణాళికలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిద్ధం చేసి ఉంచారని పేర్కొన్నారు. ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తమ ప్రభుత్వం ప్రజల పట్ల తమకు ఉన్న బాధ్యతను నెరవేర్చినట్లు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చాట్ల రమేష్, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలకు భరోసా కల్పించడమే పి4 లక్ష్యం



**పెదపారుపూడి జులై 24 మేజర్ న్యూస్ :** బంగారు కుటుంబాలకు భరోసా కల్పించి వారిని ఉన్న స్థితి నుంచి మెరుగైన స్థితికి మార్గదర్శకుల ద్వారా తీసుకుని రావడమే పి4 లక్ష్యం అని పెదపారుపూడి డిప్యూటీ ఎంపిడిఓ వంగా శ్రీనివాస్ పేర్కొన్నారు. పి4 గ్రామసభల నిర్వహణలో భాగంగా మండలంలోని మోపర్రు లో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర –2047 విజన్ లో మొదటి అంశం పేదరిక నిర్మూలన అని, సమాజాభివృద్ధిలో ఇది చాలా కీలకమని, దానిని అధిగమించడానికి పెట్టిన పథకం జీరో పావర్టీ పి4 అని పేర్కొన్నారు. గ్రామంలో సర్వే జాబితా ను అనుసరించి వచ్చిన బంగారు కుటుంబాల వివరాలు గ్రామసభ ద్వారా పునః తనిఖీ చేసి జాబితా మరోసారి ఖరారు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్ జూపల్లి కమలకుమారి అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి చొదిమెళ్ల పుల్లారావు, గ్రామస్థాయి వివిధ శాఖల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నగర పరిధిలో గల మరుగుదొడ్లను ఉత్తమ మరుగుదొడ్లుగా చెయ్యండి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పరిధిలో గల మరుగుదొడ్లను భారతదేశంలోనే ఉత్తమ మరుగుదొడ్లుగా చెయ్యాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. గురువారం ఉదయం తన పర్యాటనలో భాగంగా ఇంద్ర గాంధీ మున్సిపల్ స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్, సాంబమూర్తి రోడ్, గవర్నర్పేట సి కె రెడ్డి రోడ్, అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగర పాలక సంస్థ పరిధిలో గల మరుగుదొడ్లన్నీ భారతదేశంలోనే ఉత్తమ మరుగుదొడ్లుగా తీర్చిదిద్దాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికే నగరంలో ఉన్న 70 మరుగుదొడ్లను వాటికి చేయాల్సిన మరమ్మతులు ప్రజలకు కావాల్సిన అవసరాలకు తగ్గట్టుగా ఇంజనీరింగ్ సిబ్బంది ప్రణాళికను సిద్ధం చేయగా వాటిని త్వరగా అమలుపరిచి నగర పరిధిలోగల మరుగుదొడ్లను ఉత్తమ మరుగుదొడ్లుగా ఉంచాలని అన్నారు. నగరంలో ఇంజనీరింగ్ అధికారులందరూ ప్రతి రోడ్డులో పర్యటించి నగరంలో ఉన్న 1640 గుంతలను పుడ్చినప్పటికీ కొత్త గుంతలు ఏమైనా ఏర్పడినాయా లేవా అని ఎప్పటికప్పుడు పరిశీలించి కొత్తగా ఏర్పడిన గుంతలను కూడా పూడ్చి గుంతలు లేని నగరంగా విజయవాడ ను ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కమిషనర్ సాంబమూర్తి రోడ్ లో ప్రమాదంగా ఉన్న గ్రేటింగ్స్ను గమనించి త్వరగా మరమ్మతులు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా గ్రీటింగ్స్ను ఉంచాలని అన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉడవాలని, డివైడర్ దగ్గరి నుండి ఫుట్పాత్ వరకు పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. రోడ్డుపైనున్న పాత సామాన్లు, కార్లను ఉంచకుండా రోడ్డు సుందరీకరణలో భాగంగా వాటిని తీసివేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. బ్రిడ్జిల పైన ఉన్న మెష్లపై పిచ్చి మొక్కలు మొలవకుండా ప్రజారోగ్యం, ఉద్యానవన శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని ఆదేశించారు. నగరంలో ఉన్న మార్కెట్లు, రైతు బజార్లలో నుండి వచ్చే వ్యర్థాలపై సంపూర్ణ నివేదికను సమర్పించాలని చీఫ్ సిటీ ప్లానర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, ఎస్టేట్ ఆఫీసర్ల సమన్వయంతో వ్యర్థాల నిర్వహణపై ఒక నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వర్షాకాలం దృశ్య దోమలు పెరగకుండా ఉండేందుకు వార్డ్ వారీగా వార్డులో ఉన్న జనాభా ప్రాతిపదికన వార్డ్ సైజు ప్రకారం మలేరియా సిబ్బంది, యాంటీ మలేరియల్ ఆక్టివిటీస్ నిర్వహించాలని చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. వ్యర్థాల సేకరణలో డోర్ టు డోర్ కలెక్షన్ ఎలా జరుగుతుందో, అలాగే యాంటీ లార్వే ఆక్టివిటీస్ జరగాలని అన్నారు. తదుపరి అజిత్ సింగ్ నగర్ లో గల గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషను పరిశీలించి చెత్త తరలింపునకు మరికొన్ని వాహనాలు పెట్టి గార్బేస్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో పేరుకుపోయిన వ్యర్థాలను జిందాల్ కు పంపించే ఏర్పాట్లు అధికారులు త్వరగా చేయాలని ఆదేశించారు. తదుపరి సింగ్ నగర్ లో గల అన్న క్యాంటీన్ ను పరిశీలించి అన్న క్యాంటీన్ లో పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి, వాడుక నీటి సరఫరా జరుగుతుండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నోడల్ ఆఫీసర్లు అన్న క్యాంటీన్ ప్రతిరోజు పరిశీలించాలని కమిషనర్ ఆదేశించారు.

# నిత్యావసరాల ధరలపై పటిష్ట పర్యవేక్షణ కీలకం..



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 24, మేజర్ న్యూస్ :** వినియోగదారుల ప్రయోజనాలకు భరోసా కల్పించేలా నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలపై పటిష్ట పర్యవేక్షణ అవసరమని, బ్లాక్ మార్కెట్ వంటి చర్యలకు పాల్పడకుండా గట్టి నిఘా ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. నగరంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధ్యక్షతన జిల్లాస్థాయి ధరల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. పౌర సరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయం, ఉద్యాన తదితర శాఖల అధికారులతో పాటు వ్యాపార, వాణిజ్య సంఘాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కూరగాయల ధరల్లో వ్యత్యాసాలు, నగరంలోని, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, కాళేశ్వరరావు రిటైల్ మార్కెట్ల పరిస్థితులకు అనుగుణంగా విజయవాడ రైతుబజార్లలో నిర్ణయించిన ధరలు, బియ్యం, కందిపప్పు, పామాయిల్ తదితర నిత్యావసర సరుకుల ధరల్లో మార్పుల పై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిత్యావసర, వ్యవసాయ, ఇతర వస్తువుల ఉత్పత్తి ధోరణులు, ప్రస్తుత ధరలు, భవిష్యత్తు ధరలపై అంచనాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించి ధరలు నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని రైతు బజార్లు, హోల్ సేల్, రిటైల్ షాపులను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏదైనా వస్తువు ధర ఒక్కసారిగా పెరిగితే యుద్ధప్రాతిపదికన స్పందించి, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా మార్కెటింగ్ జోక్యంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం నిత్యావస సరుకుల ధరలు స్థిరంగా ఉన్నాయని, అయితే పచ్చి శనగపప్పు ధర విషయంలో కొద్దిగా పెరిగినట్లు గమనించి దాల్ మిల్లర్లు, వర్తకులకు ధర తగ్గింపుపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పచ్చి శనగపప్పుకు ప్రత్యామ్నాయంగా బఠానీలను కూడా వినియోగించవచ్చునని తెలియజేయాలన్నారు. టమాటా ధరలు గత వారంతో పోలిస్తే కొంత పెరిగినట్లు గుర్తించామని, చిత్తూరు జిల్లాలో టమాటా పంట చివరి దశలో ఉండడం, తమిళనాడు వ్యాపారస్తులు చిత్తూరు మార్కెట్‌లో టమాటాలను కొనుగోలు చేయడం వల్ల ధరలు కొద్దిగా పెరిగినట్లు అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. టమాట ధరలు పెరిగినట్లయితే చిత్తూరు జిల్లా నుండి కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు వినియోగదారులకు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో ఎ.పాపా రావు, జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి బి. రాజాబాబు, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, రైసు మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ ఉధ్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్యాల సాధనకు బంగారు బాటలు వేసుకోండి

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 24, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పరంగా మెరుగైన మార్పులు చేయడంతో ప్రవేశాలు పెరిగాయని, వీటిని సద్వినియోగం చేసుకొని కెరీర్ పరంగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు బంగారు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. విజయవాడ కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నతపాఠశాలను కలెక్టర్ లక్ష్మీశ గురువారం మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా.. లేదా? ఆహారం నాణ్యత ఎలా ఎంది? వంటి విషయాలను పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 370 మంది విద్యార్థులుండగా అందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నట్లు తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. సన్నబియ్యంతో పోషక విలువలతో కూడిన భోజనం చాలా బాగుంటుందోని, తామంతా ఇక్కడే తింటున్నామని చిన్నారులు చెప్పారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ కెరీర్ పరంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు ఏమిటో అడిగి తెలుసుకున్నారు. బాగా చదవడంతో పాటు సరైన ప్రవర్తన కూడా ముఖ్యమని.. ఇవి రెండూ ఉన్నప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి అవకాశముంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పాఠశాల వ్యవస్థ బాగా మెరుగుపడిందని.. పిల్లలు, తల్లిదండ్రుల్లో విశ్వాసం



పెరిగిందన్నారు. చిన్నారులను అన్ని విధాలా సరైన దారిలో నడిపించే లక్ష్యంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెగా పీటీఎం నిర్వహించిం దని.. ఇందు లో భాగంగా నిర్వహించిన గ్రీన్ పాస్‌పోర్ట్, తల్లికి వందనం వంటి వినూత్న కార్యక్రమాలు కూడా విజయవంతమయ్యాయన్నారు. చిన్నప్పటి నుంచే విలువలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతా యన్నారు. విద్యార్థులు సరైన దిశగా వెళ్లేలా ప్రోత్సహించడం జరుగుతోందని.. మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలుపైనా అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో కెరీర్ కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించేందుకు చొరవ తీసుకోవడం జరుగుతోం దని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ వెంట పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం.నరసింహాచార్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## వైయస్ఆర్సీపీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయండి



**పెదపారుపూడి జులై 24 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దోసపాడు గ్రామంలో కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం మండలస్థాయి సమావేశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరు కూడా తెలుగుదేశం, కూటమి ప్రభుత్వ మోసాలను స్కాన్ చేసి ప్రజలకు ఎలా వివరించాలి అనే అంశం పై నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన అవగాహన కల్పించారు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోగం రమేష్ అధ్యక్షులు జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గుర్రపు డెక్క ఆకు, ఆక్రమణలతో

## ప్రధాన మురుగు నీటి కాలువ





**నాగాయలంక జూలై 24 మేజర్ న్యూస్ :** గ్రామపంచాయతీ పరిధిలోని మురుగునీటి పారుదల సచివాలయం-ఒకటి సచివాలయం-రెండు నుండి వచ్చు మురుగునీరు ప్రధాన మురుగునీటి కాల్వలో గుర్రపు డెక్కఆకు, ప్లాస్టిక్ కవర్లుతో, పూడిపోయి గ్రామములో నీరు డ్రైనేజ్ లోనికి సరిగ్గా పారుదల లేకరోడ్లపైననిలిచిపోవుతున్నది దీనితో దోమలు బాధ భరించలేక వర్షాలువల్ల మురికి నీరువాసనతో ఇబ్బందులు పడుతున్నారు నాగాయలంక గ్రామస్తులు సంబదిత శాఖ అదికారులు డ్రైనేజ్ శాఖ, సచివాలయం - ఒకటి సచివాలయం-రెండు అధికారులు సమస్య పరిష్కారం చేయమని నాగాయలంక గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అంగలూరులో జ్ఞానసాయికి విశేషాభిషేకాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయికి మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో గురువారం వేకువజామునే వేద పండితులు విశేషాభిషేకాలను చేపట్టారు. అనంతరం సాయికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయ ప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద నిరోధక అవగాహన



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి ఎం.జి.రోడ్ లో ఉన్న స్వాతి షాపింగ్ మాల్, రైమండ్స్ షోరూం ను ఆకస్మిక తనిఖీ చేసారు వి యం సి సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

### సంక్షేమంతో పాటు, అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించడమే..

# 'సుపరిపాలనలో తొలిఅడుగు' ప్రధాన సంకల్పం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఏడాదిలో సాధించిన విజయాలు, సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి పనులు ఇంటింటికీ వెళ్లి వివరించడమే కాదు. ఇంటింటికీ ఇవ్వాల్సిన సంక్షేమం, ఆ పల్లెలో చేయాల్సిన అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేయాలనే మహోన్నత ఆశయంతో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు వెల్లడించారు. సీఎంచంద్రబాబునాయుడు సారథ్యంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం మైలవరం నియోజకవర్గంలో విజయవంతంగా కొనసాగుతోంది. స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రతిరోజూ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. తాజాగా జి.కొండూరు మండలంలోని కట్టుబడిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. శాసనసభ్యులు కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ద్వారా 'ఇంటింటా సంక్షేమం.. పల్లెపల్లెన ప్రగతి చేసి చూపిస్తాం' అంటూ ప్రధాన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడాది పాల నలో వృద్ధులకు పింఛన్ రూ.4వేలకు పెంపు, తల్లికి వందనం, దీపం, మెగా డీఎస్సీ.. వంటి హామీలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేశామన్నారు. రైతులకు పెట్టు బడి సాయం చేసి అండగా నిలవాలని 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు కసరత్తు పూర్తయిందన్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కూటమి కుటుంబ సభ్యులంతా ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఘనంగా స్వాగతం పలికిన అధికారులు







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గురువారం ఉదయం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ నాతకోత్సవంలో పాల్గొనేందుకు గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు ఘనంగా స్వాగతం లభించింది. తొలుత గవర్నర్ ట్రస్ట్‌కు చేరుకోగానే పోలీసు గౌరవ వందనం స్వీకరించాక జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆర్. శారద జయలక్ష్మి దేవి ఘనంగా స్వాగతం పలికి మొక్కలను అందజేశారు. స్నాతకోత్సవం ముగిశాక గవర్నర్, ట్రస్టులోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రం సందర్శిం చి అక్కడి అబ్దుల్ కలాం విగ్రహానికి పు ష్పాంజలి ఘటించారు. అనంతరం శిక్షణ కేంద్రంలోని ప్లంబింగ్ శానిటరీ ప్రయోగ శాల, విద్యుదీకరణ ప్రయోగ శాల, సౌర శక్తి శిక్షణ కేంద్రం, కారు మెకానిక్ శిక్షణ కేంద్రాలను పరిశీలించి అక్కడి శిక్షణార్థుల తో కాసేపు ముఖాముఖి మాట్లాడి వారితో కలిసి ఫోటోలు దిగారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ ట్రస్ట్ కార్యకలాపాలను గవర్నర్కు వివరి స్తూ స్వర్ణ భారత్ ట్రస్ట్ విజయవాడతోపాటు హైదరాబాదు, నెల్లూరులో చాప్టర్లు ఉన్నాయన్నారు. శిక్షణా కేంద్రంలో గ్రామీణ మహిళలకు యువతకు, రైతులకు 40 రకాలకు పైగా అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 95 వేల మందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ వెంట లేడీ గవర్నర్ సమీరా అబ్దుల్ నజీర్, గవర్నర్ కార్యదర్శి హరిజవహర్లాల్, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, ఎడిసి అమన్దీప్ సింగ్,, అదనపు ఎస్పీ సత్యనారాయణ, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, డిఎస్పి శ్రీనివాసరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.



## సీఎంను ఆహ్వానించిన ఎమ్మెల్యే మండలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలం వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలకు రావలసిందిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆహ్వానం పలికారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం సీఎం ఛాంబర్ లో చంద్రబాబు ను కలిసి తన తండ్రి, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు ఆగస్ట్ 4నుంచి ఏడాది పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలో జరిగే శత జయంతి సభకు హాజరవుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు బుద్ధప్రసాద్ కు తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆర్.అండ్.బీ రహదారుల పరిస్థితిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సీఎం చంద్రబాబుకు వివరించి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థి దశ నుండే పంచే గుణం అలవర్చుకోవాలి

**విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను నిర్వహించాలి**

**ప్రతిభ కలిగిన విద్యార్థులకు విదేశీ విద్యకు సాయం అందిస్తా : పి4 భాగస్వామి సాత్విక్ మురారి**

**శ్రీ విజయ అకాడమీ విద్యార్థి పి4 భాగస్వామి కావటం హర్షణీయం**

**కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ**



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** విద్యార్థి దశ నుండే పంచే గుణం అలవరచుకోవాలని విద్యార్థినీ విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని పి4 భాగ స్వామి సాత్విక్ మురాల సూచించారు. గురువారం ఉదయం శ్రీ విజయ అకాడమీ విద్యార్థులతో సాత్విక్ ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో తాను ఎన్నో కష్టాలు అనుభవించి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వ సాయంతో విదేశీ విద్యను అభ్యసించి ప్రస్తుతం ఐర్లాండ్ లో వ్యాపారవేత్తగా స్థిరపడ్డానని అన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పి4 కార్యక్రమంలో భాగస్వామి అయి పేద విద్యార్థులకు విదేశీ విద్యను అందించడానికి రూ.50 లక్షల సహాయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అందించడం జరిగిందన్నారు. ఇదే విధంగా విద్యార్థి దశనుండే నలుగురికి మంచి చేయాలని ఆలోచనలు కలిగి ఉండి సమాజానికి మంచి చేయాలని కోరారు. పి4 భాగస్వామి సాత్విక్ శ్రీ విజయ అకాడమీ పూర్వ విద్యార్థి కావడం చాలా ఆనందదాయకంగా ఉందని కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ అన్నారు. అనంతరం సాత్విక్ కు దుస్సాలువా కప్పి ఘన సన్మానం చేశారు. ఎన్ఆర్ఐ, గొర్రెపాటి విద్యా ట్రస్ట్, శ్రీ విజయ అకాడమీ చైర్మన్ గొర్రెపాటి రంగనాథ్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు సాత్విక్‌కు అభినందనలు తెలియజేశారు. తాను చదువుకున్న పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పి తన ఉన్నతికి బాటలువేసిన ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు దంపతుల నుంచీ సాత్విక్ ఆశీస్సులు అందుకున్నారు.

## సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఏ.సి.పి.



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా మహిళా పోలీసు స్టేషన్‌లో డి.ఎస్.పి.గా పని చేస్తున్న బి.రాజ శేఖర్ ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ క్రైమ్ ఏ.సి.పి.గా బదిలీ అయి నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

## తీన్మార్ డప్పు కళాకారులకు జనసేన చేయూత



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** తీన్మార్ డప్పు కళాకారులకు జన సైనికులు చేయూతనందించారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా చల్లపల్లి మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో తీన్మార్ నూతనంగా నేర్చుకున్న మంగళాపురం యువకుల బృందానికి రూ.25 వేలు విలువ గల తీన్మార్ డప్పు వాయిద్యాలను వితరణగా అందజేశారు అనంతరం తీన్మార్ డప్పు వాయిద్యాలతో శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని మండలి వెంకట్రామ్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ కూటమినేతలు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు చల్లపల్లి టౌన్ ప్రెసిడెంట్ బొందలపాటి వీరబాబు, అడపా రవి, టిడిపి నేతలు రావి చిట్టిబాబు, రావి రాజేశ్వరరావు కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ కార్యాచరణ ప్రణాళిక



**జగ్గయ్యపేట,జూలై 24,మేజన్ న్యూస్ :** కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు గ్రామములో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ @ 2047కు సంభందించి నియోజకవర్గ కార్యచరణ ప్రణాళికలు తయారు చేయు నిమిత్తం జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.బాలాజీ కుమార్ జిల్లా ఉద్యావన అధికారి, కె బాలకృష్ణ రెవిన్యూ డివిజన్ ఆఫీసర్ నందిగామ వారి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), జగ్గయ్యపేట శాసన సభ్యులు, కృష్ణ మిల్క్ బోర్డు చైర్ పర్సన్ చలసాని ఆంజనేయులు, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి, నందిగామ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహశీల్దార్ వార్లు, జగ్గయ్యపేట డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మహిళా సమైక్య అధ్యక్షురాలు గద్దె రాజలక్ష్మి,, డా.అచ్యుతా రాజు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.వి.గరికపాడు, డా.ఎస్.కృష్ణం రాజు, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోదనా స్థానం, గరికపాడు, డా.టి. జెశ్వంత్ రెడ్డి, శాస్రవేత్త, పశు వైద్య విభాగం, డా.పి.యన్.శివ ప్రసాద్ శాస్త్రవేత్త, సేద్య విభాగం, డా.ఆర్ ప్రభావతి గృహ విజ్ఞాన విభాగం, డా. ఎన్.రాజశేఖర్ సస్య రక్షణ విభాగం, డా.ఐ.వెంకట రెడ్డి, వ్యవసాయ విస్తరణ విభాగం, కె.డా.లక్ష్మి కళా ఉద్యాన విభాగం, మండలాలలో మండల హార్టికల్చర్ ఆఫీసర్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్, ఫిషరీస్ అసిస్టెంట్, అనిమల్ హస్బండరి, ఏపీఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999